క్లుప్తంగా

వేడుకగా యోగా నరసింహ స్వామి జయంతి



పూజల్లో పాల్గొన్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో వెలసిన యోగా నరసింహ స్వామి జయంతిని శనివారం వేడుకగా నిర్వహించారు. అర్చకులు శ్రీహరి ఆచారి స్వామి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, నిర్మల్యవిసర్జన, మహా పంచామృతాభిషేకం తదుపరి శ్రీ స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప, నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, కాంతరెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మద్యపాన అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి

కోసిగి : మద్యం తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి జాగ్రత్తలు పాటించాలని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ రజిత సమక్షంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు కేర్ (కమిటీ ఫర్ ఆల్కాహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్‌పాన్సివ్ ఎడ్యుకేషన్) కార్యక్రమంలో భాగంగా మద్యపాన అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మద్యానికి దూరంగా ఉండాలని, తాగి వాహనాలు నడపకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ కార్తిక్‌సాగర్, సిబ్బంది కిశోర్, మునిరంగడు,భరత్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం కండి



మాట్లాడుతున్న ప్రజా సంఘం నాయకులు

ఆదోని రూరల్: ఈనెల 20వన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, వైఎస్సార్‌టీయూ ఎల్ఐసీ ఆల్ బ్యాంకర్స్ యూనియన్ నాయకులు సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో సమ్మెకు సంబంధించి సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపదలు ప్రధాని మోదీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్మికులకు ఇబ్బందికరంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం అందించాలని డిమాండ్ చేశారు.

స్టేట్ మీట్‌కు ఆదోని క్రీడాకారుడు



క్రీడాకారుడు బి.కళ్యాణ్

ఆదోని సెంట్రల్: కబడ్డీ స్టేట్ మీట్‌కు ఆదోనికి చెందిన క్రీడాకారుడు బి.కళ్యాణ్ ఎంపికైనట్లు కర్నూలు క్రీడాకారుల అసోసియేషన్ సెక్రటరీ శుభకర్ శనివారం తెలిపారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో విజయనగరం స్టేడియంలో జరగనున్న పోటీలో కర్నూలు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. స్టేట్ మీట్‌కు ఎంపికైన కళ్యాణ్‌ను కోచ్ అమర్‌ప్రకాష్, స్నేహితులు, క్రీడాకారులు అభినందించారు.

వాయుపుత్రుడికి అభిషేక పూజలు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె గ్రామంలో, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలను చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు జరిపించారు.

రేపు సంస్మరణ దినోత్సవం

ఆదోని అర్బన్: స్థానిక చౌకీమఠంలో రాచోటి మహాశివయోగుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భక్తబృందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, ధర్మ సభ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం మహాశివగణరాధన ఉంటుందన్నారు.

వీర జవాన్‌కు ఘన నివాళి



వీరజవాన్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరురూరల్: భారత్ – పాకిస్తాన్ మధ్య జరిగిన కాల్పుల్లో వీర మరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్‌కు శనివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బుట్టా నీలకంఠ మాట్లాడుతూ వీరజవాన్ మురళీనాయక్ వీర మరణంతో దేశం గర్విస్తుందన్నారు. వీరజవాన్ యువతకు ఆదర్శంగా నిలిచాడని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, కెఆర్. లక్ష్మీకాంతరెడ్డి, విరుపాక్షిరెడ్డి, శివరామిరెడ్డి, కెఆర్.రామకోటేశ్వర రెడ్డి, శివప్రసాద్, సునీల్‌కుమార్, పాల శ్రీనివాస రెడ్డి, బజారి, డిష్ కేశవరెడ్డి, గడ్డం అంజినయ్య, నరసింహులు, మాబాషా, అల్తాఫ్, గురవయ్య, శరత్, సుధాకర్, సోమేష్, లతారెడ్డి, నాగేంద్ర, వాల్మీకి జయమ్మ, రాజు, పామయ్య, ప్రభాకర్, సయ్యద్ చాంద్, చంద్రశేఖర్, గౌస్, యూసఫ్, మణి, మాచాని రఘు తదితరులు పాల్గొన్నారు. అలాగే.. సోమప్ప సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నివాళర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచాడని తెలిపారు. సమీవుల్లా, దాదావలి, జబ్బార్, రాజీవ్, ఖాజ, రామాంజీ, ఎల్లప్ప పాల్గొన్నారు.



కనకవీడులో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నందవరం : జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో పాకిస్థాన్ జరిగిన కాల్పుల్లో అమరుడైన వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి గ్రామంలోని యువకులు, నాయకులు శనివారం నివాళులర్పించారు. నందవరం, కనకవీడు గ్రామాల్లో కొవ్వొత్తుల ర్యాలీ, జవాన్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ శివ, పెద్ద ఈరన్న, చంద్రబాబు, జగనాథ్, రంగన్న, కోటేశ్వర పాల్గొన్నారు.



నందవరంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రావణమాస ఉత్సవాల ముందస్తు ఏర్పాట్ల పరిశీలన

- ఉరుకుందలో పర్యటించిన స్థపతి, ఏఈ
- ఏర్పాట్లపై ఆలయ అధికారులు, అర్చకులకు సూచనలు



ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లపై సూచనలిస్తున్న అధికారులు



కార్యాలయంలో అధికారులతో సమావేశం

కౌతాళం: శ్రావణమాసం సందర్భంగా ఉరుకుంద ఈరన్నస్వామి క్షేత్రంలో జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని ముందస్తుగా ఏర్పాట్లను దేవదాయ శాఖ అధికారులు పరిశీలించారు. శనివారం స్థపతి సుబ్రహ్మణ్యం, ఏఈ రవికుమార్‌రెడ్డితో కలిసి ఆలయ డిప్యూటీ కమిషనర్ 2025 శ్రావణమాస ఉత్సవాలపై ప్రత్యేక సమీక్షను నిర్వహించి ఆలయ పరిసరాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించారు. భక్తుల సౌకర్యార్థం మంచినీటి ఆర్‌ఓ ప్లాంట్, టాయిలెట్స్, క్యూలైన్లు, సెంట్రల్ స్టోర్, విచారణ కేంద్రం, డ్రైనేజీ వ్యవస్థ, 52 నూతన గదుల నిర్మాణం, దేవస్థానం చుట్టూ సిమెంటు రోడ్డు నిర్మాణం, కోనేరు, నూతన గోశాల షెడ్డు వంటి పనులను తిరిగి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్ల చేసేందుకే ఈ ముందస్తు ప్రణాళిక అని చెప్పారు. శ్రావణ మాసంలో వచ్చే భక్తుల దృష్టిలో ఉంచుకుని అలాగే నిత్యం దర్శనానికి వస్తున్న భక్తుల కోసం మాస్టర్ల ప్లాన్ ప్రకారం పనులు చేపడుతామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. సౌకర్యాల ఏర్పాటులో సలహాల కోసమే స్థపతిని, ఈఏని ఆహ్వానించినట్లు చెప్పారు. ఆలయ పర్యవేక్షకులు, అర్చక, ఆలయ సిబ్బంది ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక అల్లిపీర స్వామి దర్గా

- 12 నుంచి ఉరుసు
- వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తుల రాక



అల్లీపీరస్వాముల దర్గా ముఖద్వారం

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని గుడేకల్ గ్రామంలో వెలసిన అల్లీ పీరస్వామి దర్గా కులమతాలకు అతీతంగా కొలిచే వారికి కొంగుబంగారంగా పూజలందుకుంటున్నాడు. ఏటా మే నెల వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు స్వామి వారి ఉరుసు జరుగుతుంది. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు ఉన్నారు. దర్గాలో అల్లీసాహెబ్, ఉశేనీపీరాస్వామి, అల్లిపీరస్వామి సమాధులను భక్తులు పూజిస్తారు. అల్లీసాహెబ్ 1893, కుమారుడు ఉశేన్‌పీరా 1926, మనవుడు అల్లీపీరస్వామి 1957లో స్వర్గస్తులైనట్లు సేవకులు చెబుతారు. ప్రస్తుత పీఠాధ్యక్షుడు (సేవకులు) ఘాజీ ఉశేనిపీరస్వామి వ్యవహరిస్తున్నారు. ప్రశాంతతకు నిలయంగా అల్లీపీరస్వాముల దర్గాగా పేరొందింది.

12 నుంచి ఉరుసు: అల్లీపీరాస్వాముల ఉరుసు మహోత్సవ వేడుకలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుంది. శనివారం దర్గాలో సేవకులు, దర్గా ప్రెసిడెంట్ గురు ఘాజీ హుసేన్‌పీరా స్వాములు మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఉత్సవాలు ఉంటాయని, 12న గంధం, 13న ఉరుసు ఉంటుందని చెప్పారు. ఉత్సవాలకు కర్నూల్, కడప, అనంతపురం, చిత్తూర్ జిల్లాలతో పాటు తెలంగాణ, సర్కార్ ప్రాంతాల నుంచి ఎక్కువగా భక్తులు వస్తారని తెలిపారు. బళ్లారి, రాయచూర్, చిత్రదుర్గా, బెంగళూర్, గుల్బార్గా జిల్లాలతో పాటు అలాగే ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. భక్తులు ఆదివారం సాయంత్రానికే దర్గాకు చేరుకుంటారని, భక్తులకు ఇబ్బందులు రాకుండా చలువ పందిళ్లు ఏర్పాటుతో పాటు, భోజన వసతి ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రేపు వెంకప్ప స్వామి ఆరాధనోత్సవాలు



స్వామి వారి సమాధి



సమాధి వద్ద మహా వృక్షం

మద్దికెర : చుట్టూ మర్రి చెట్టు ఊడలు.. ఆ పరిసరాలను చూడగానే కొద్దిసేపు ఇక్కడే ఉండి పోదామనే ఆహ్లాదకరమైన వాతావరణం. మండు వేసవిలో సైతం చల్లని గాలి.. మండల కేంద్రం మద్దికెర గ్రామ శివారులోని బొజ్జనాయునిపేట గ్రామానికి వెళ్లే దారిలో పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణంలో వెలసిన శ్రీవెంకప్ప స్వామి ఆలయం. స్వామి వారి 93వ ఆరాధన మహోత్సవాలు ఈనెల 12వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం స్వామి వారి సమాధిని అలంకరించి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

సంతాన దేవుడు:
సంతానం కలగని వారు ఎంతో మంది వెంకప్ప స్వామి వారిని నాలుగు సోమవారాలు మొక్కుకుంటే కోరిక నెరవేరుతుందని భక్తుల విశ్వాసం. అంతేగాక ఈప్రాంతంలో చాలా మంది వెంకమ్మ, వెంకప్ప అను పేర్లు పెట్టుకుంటారు. అలాగే రైతులు ఎంతో ప్రేమగా పెంచుకునే పశువులకు నయం కాని రోగాలు వస్తే స్వామి వారి సమాధి చుట్టూ తిరిగితే రోగాలు నయం అవుతాయని అన్నదాతల నమ్మకం.

పెద్దహరివాణం పీహెచ్‌సీని పరిశీలించిన సీపీఎం బృందం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీపీఎం బృందం శనివారం పరిశీలించింది. సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి ఎం.అయ్యన్న, పార్టీ సీనియర్ నాయకులు రామలింగప్ప, పార్టీ సభ్యులు లక్ష్మన్న, గర్జప్ప ఆసుపత్రిలో రోగులకు కల్పిస్తున్న సౌకర్యా లు, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 పడకల నుంచి ఆరు పడకలకు కుదించడం, ఇద్దరు డ్యూటీ డాక్టర్లకు గానూ ఒకరినే నియమించడం తగదన్నారు. 30 పడకలను పునరుద్ధరించి, మరో డ్యూటీ డాక్టర్‌తోపాటు సిబ్బందిని నియమించాలని కోరారు.

వివక్షపై ఐక్యంగా పోరాడుదాం

గోనెగండ్ల: వివక్షత, అంటరానితనం, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, జయరాజు అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశం టెక్నాలజీ పరంగా అభివృద్ధి చెందుతున్నా.. గ్రామ సీమల్లో వివక్షత, అంటరానితనం కొనసాగుతున్నాయన్నారు. జిల్లా, మండల అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. విజయమ్మ, భాస్కర్, పెద్దబాబు, మారయ్య, జిల్లా కమిటీ సభ్యులు యేసు రాజు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని రాంజల చెరువు వద్ద పేకాట ఆడుతున్న వారిపై త్రీటౌన్ పోలీసులు శనివారం దాడులు చేశారు. బసవరాజుతోపాటు మరో 13 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.83 వేలు స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

చిప్పగిరి: రేషన్‌కార్డు లేని వారు కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఇజాజ్ అహ్మద్ మండల ప్రజలకు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు తప్పనిసరిగా ప్రజాసాధికార సర్వేలో నమోదై ఉండాలన్నారు. కొత్తగా పెళ్లయిన వారు వివాహ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలతో సమీప గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు. పాత కార్డులకు సంబంధించి మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

వెల్దుర్తి: ఎల్ బండ తండా పరిసరాల్లో శనివారం కోడుమూరు ఎక్సైజ్, కర్నూలు ఈఎస్‌టీఎఫ్ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 960 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 21 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐలు మంజుల, కృష్ణ తెలిపారు. తండాకు చెందిన ముగ్గురు అనుమానితులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పథకాలు అమలుకాక ఇబ్బందుల్లో ప్రజలు



దేగులహాలులో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

చిప్పగిరి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. శనివారం మండలంలోని దేగులహాలు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పోతప్ప కూతురు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు తప్ప ఏ ఒక్క సంక్షేమ పథకము అమలుకు నోచుకోవడంలేదని ఎద్దేవా చేశారు. ప్రజలను భయాందోళనకు గురిచేస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజలు త్వరలో తిరగబడే పరిస్థిలున్నాయని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించి ఇష్టారీతిన పాలన సాగిస్తున్నారన్నారు. మల్లికార్జున,మారయ్య,లాల్ స్వామి,ధనుంజయ పాల్గొన్నారు.

గాయపడిన బాలుడు మృతి

తుగ్గలి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌కు చెందిన ముస్తాఫా (15) మృతి చెందాడు. ఈనెల 7న ముస్తాఫా తుగ్గలి– కోతికొండ గ్రామాల మధ్య బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తల్లి రజియాబేగం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తుగ్గలి పోలీసులు శనివారం తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



గూళ్యంలో కాపలాగా ఉన్న తలారి



బల్లూరులో కాపలాగా ఉన్న వీఆర్వో తిప్పన్న, తలారి

హాలహర్వి: అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి శనివారం హెచ్చరించారు. అక్రమంగా ఇసుకను తరలించకుండా ఆయా ప్రాంతాల్లో వీఆర్వోలు, తలారులను ఏర్పాటు చేశారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. ఇసుకను తరలించిన వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు వారిపై వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. వీఆర్వోలు ఈరన్న, తిప్పన్న, రాఘవేంద్రస్వామి, రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునే విధుల్లో ఉన్నారని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న పీడీ చిరంజీవి

వెల్దుర్తి: హౌసింగ్ శాఖ ద్వారా ఇళ్లు మంజూరై నిర్మాణాలు ఆపిన వారికి అదనపు నిధులు మంజూరయ్యాయని, లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయించాలని హౌసింగ్ శాఖ పీడీ, జిల్లా స్పెషల్ కలెక్టర్ టి.చిరంజీవి ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో హౌసింగ్ శాఖ ఈఈ ప్రభాకర్, డీఈ విజయకుమార్‌తో కలిసి మండల హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. పీడీ మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేల ప్రకారం మండలంలో 97 మంది లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం మంజూరైందన్నారు. జూన్ 12వ తేదీలోపు లక్ష్యాలు పూర్తి చేయాలని సూచించారు.

నివాళి

ఆస్పరి: మాల మహానాడు వ్యవస్థాపకులు పి.వి. రావు జయంతిని మండల కేంద్రంలో శనివారం మాలమహానాడు ఆధ్వర్యంలో జరపుకున్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుడిసె మహానంది, ఆ సంఘం నాయకులు భరత్, వీరేష్, నీలప్ప, సావిత్రమ్మ, మునెమ్మ, అన్నపూర్ణ, నాగలక్ష్మి, సుజాతమ్మ, అంజిబాబు పి.వి. రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పేర్లు మారవేమీ?

- సమాచార హక్కుచట్టం బోర్డులో దర్శనమిస్తున్న పాత అధికారుల పేర్లు



ఎంపీడీఓ కార్యాలయంలో మారని అధికారుల పేర్లు

దేవనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమాచార హక్కుచట్టం బోర్డులో అధికారుల పేర్లు మారకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అధికారులు ఎవరనేది తెలియక తికమక పడుతున్నారు. కార్యాలయంలో గత కొన్ని సంవత్సరాల క్రితం పనిచేసిన ఎంపీడీఓ ఆదెయ్య, ఏఓ ఇద్రూష్‌బాషా, సీనియర్ అసిస్టెంట్ దేవదానం బదిలీపై వెళ్లి సంవత్సరాలు గడిచినప్పటికీ సమాచార హక్కుచట్టం బోర్డులో వారి పేర్లే నేటికీ దర్శనమిస్తున్నాయి. కనీసం ప్రస్తుతం పనిచేస్తున్న అధికారుల పేర్లను చేర్చడంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పేర్లు మార్చాలని పలువురు కోరుతున్నారు.

స్నేహితుడి కుమార్తె వివాహానికి చేయూత



పెయింటర్ రహిమాన్‌కు నగదు అందిస్తున్న స్నేహితులు

గోనెగండ్ల: తమతో కలిసి చదువుకున్న స్నేహితుడి కూతురు వివాహానికి తోటి స్నేహితులు చేయూతనందించి ఆదుకున్నారు. మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన పెయింటర్ రహిమాన్ 6–10 వ తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. 1999 పదవ తరగతి పూర్తిచేశాడు. అయితే రహిమాన్ పెయింటర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఆయనది. ఇటీవల రహిమాన్ కుమార్తెకు పెళ్లి కుదిరింది. ఈ నెలలో వివాహం జరగనుంది. ఆయన ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న ఆయనతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు చేయి చేయి కలిపి రూ.50వేల నగదును పోగుచేసి శనివారం ఆయన ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. పూర్వ విద్యార్థులు జాకీర్ హుసేన్, చాంద్ బాషా, డ్రైవర్ వలి, షేక్షావలి, నూర్ బాషా పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని అర్బన్: పాకిస్తాన్, భారత్ యుద్ధ వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఇండియన్ ఆర్మీకి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి బలాన్ని చేకూర్చాలని ప్రార్థిస్తూ శనివారం పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజుగౌడ్, ఆదోని సెంట్రల్ మండల అధ్యక్షుడు నాగార్జున తదితరులు మాట్లాడుతూ పహల్గాంలో హిందూ పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపడం అన్యాయమన్నారు. పాకిస్తాన్ కవ్వింపు చర్యలను ఇండియన్ ఆర్మీ ఎప్పటికప్పుడు తిప్పి కొడుతోందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లోకేష్‌కుమార్, వినోద్‌కుమార్, చెన్నబసప్ప, భాగ్య, రాజ్‌కుమార్, శేఖర్, వినోద్, నాగరాజు, శివరాం, హనుమంతు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు వాహన డ్రైవర్లకు సూచించారు. శనివారం స్థానిక ప్రభాకర్ టాకీసు, రైతు బజార్, మార్కెట్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రికార్డుల గురించి అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు, ఉండాల్సిన వాహనాల రికార్డులను, రోడ్డు ప్రమాదాల నియమాల గురించి వివరించారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఖాతాలు సక్రమంగా వున్నాయో లేదో సరిచూసుకోవాలని ఏఓ రవి శనివారం తెలిపారు. పీఎం కిసాన్ రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14 వేలు కలిపి విడతల వారీగా రూ.20 వేలు అందుతాయని చెప్పారు. రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా పుస్తకంతో ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదించాలని, ఇందుకు ఈనెల 20వ తేదీ వరకు మాత్రమే గడువుందని వివరించారు.

ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓగా శివకుమార్

మద్దికెర: మండల కేంద్రంలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌కు డిప్యూటీ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారని మండల అధికారులు శనివారం తెలిపారు.